# ప్రత్యేక ఖాతా నుంచి లావాదేవీలు నిర్వహించాలి

**బ్యాంకర్లు అభ్యర్థులకు సహకరించాలి**

**కలెక్టర్ ప్రియాంక ఆల**

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 30 : ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ప్రత్యేక బ్యాంకు ఖాతా నుంచి లావాదేవీలు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయం మినీ సమావేశ మందిరంలో ప్రత్యేక బ్యాంకు ఖాతాలు ప్రారంభించడం, నగదు లావాదేవీలు నిర్వహణ తదితర అంశాలపై ఆదాయపు పన్ను, బ్యాంకు కంట్రోలింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా ప్రారంభించాల్సి ఉన్నందున బ్యాంకర్లు అభ్యర్థులకు సహకరించాలని సూచించారు. నవంబర్ 3వ తేదీ నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతున్నందున అభ్యర్థులు బ్యాంకు ఖాతాలు ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు ప్రారంభించిన ప్రత్యేక బ్యాంకు ఖాతా నుంచి మాత్రమే లావాదేవీలు చేయాల్సి ఉంటుందన్నారు. బ్యాంకులో తక్షణ సేవలు అందించాలని సూచించారు. బ్యాంకు లావాదేవీలపై పటిష్ట నిఘా ఉంటుందని, నగదు రవాణాకు సీ విజిల్ యాప్ ద్వారా అనుమతి తీసుకోవాలని అన్నారు. బ్యాంకు ఖాతా నుంచి పెద్దమొత్తంలో నగదు లావాదేవీలపై పర్యవేక్షణ ఉండాలని, 10లక్షలకు మించి జరిగే లావాదేవీలపై ఆదాయపు పన్నుశాఖ అధికారుల ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. సమావేశంలో వ్యయ పరిశీలన నోడల్ అధికారులు వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి, ఎల్‌డీఎం రాంరెడ్డి, ఆదాయపు పన్నుశాఖ నోడల్ అధికారి సింధు, అన్ని బ్యాంకుల కంట్రోలింగ్ అధికారులు పాల్గొన్నారు.



బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

**సీజ్ చేసిన నగదుపై నివేదికలు అందజేయాలి**

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 30 : సీజ్ చేసిన నగదు, మద్యం తదితర అంశాలపై రిటర్నింగ్ అధికారులు సమగ్ర నివేదికలు అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయం సమావేశ మందిరంలో పోలీస్, సీజర్స్, గ్రీవాన్స్ కమిటీ, రిటర్నింగ్ అధికారులు, ఎక్సైజ్ అధికారులతో సీజర్స్, ఎన్నికల విధులు కేటాయించిన సిబ్బందికి పోస్టల్‌బ్యాలెట్ జారీ, బెల్టుషాపులు మూసివేత తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్లయింగ్‌స్క్వాడ్ టీములు పట్టుకున్న నగదుకు తక్షణమే రశీదులు అందజేసి గ్రీవాన్స్ కమిటీని ఏ విధంగా సంప్రదించాలో అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లాలో 756 బెల్టుషాపులను మూసేసినట్లు చెప్పారు. బెల్టు దుకాణాలు నిర్వహణపై పటిష్ట నిఘా కొనసాగించాలన్నారు. పట్టుకున్న నగదు, ఆభరణాలు, మద్యం తదితర వస్తువుల వివరాలను ఎన్నికల సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టంలో ఆన్‌లైన్ చేయాలన్నారు. 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, 40శాతం పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఎన్నికల సంఘం అవకాశం కల్పించినందున క్షేత్రస్థాయిలో పరిశీలించి జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. పట్టుబడిన నగదు, ప్రచారంలో భాగంగా పొందాల్సిన అనుమతులపై అవగాహన కల్పనకు జిల్లాలోని ఐదు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో 24 గంటలు పనిచేసే విధంగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎస్పీ డాక్టర్ వినీత్, పినపాక నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్, అశ్వారావుపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాంబాబు, సీజర్స్ కమిటీ మధుసూదన్‌రాజు, వెంకటేశ్వర్లు, దుర్గాంబ, రిటర్నింగ్ అధికారులు శిరీష, మంగీలాల్, కార్తీక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

## పోలింగ్ ప్రక్రియకు ఏర్పాట్లు చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 30 : అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నిర్వహణకు జిల్లా ఎన్నికల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ కమిషనర్ నితేష్‌వ్యాస్ అన్నారు. సోమవారం ఢిల్లీ నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ముఖ్యఎన్నికల అధికారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణకు అన్ని ఆర్‌వో కార్యాలయాల్లో ఏర్పాట్లు చేయాలని చెప్పారు. రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణకు సమయపాలన పాటించాలన్నారు. ప్రతి నామినేషన్ ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లా నుంచి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల, ఎస్పీ వినీత్, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, ఏఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ రాంబాబు, సీజర్స్ కమిటీ అధికారులు మధుసూదన్‌రాజు, వెంకటేశ్వర్లు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణ అందించాలి

రామవరం, అక్టోబర్ 30 : రాష్ట్ర మైనార్టీ స్టడీ సర్కిల్ ద్వారా యూపీఎస్‌సీ సీ.సాట్ 2024 పరీక్షకు దరఖాస్తు చేసుకున్న మైనార్టీ అభ్యర్థులందరికీ సివిల్స్‌లో ఉచిత శిక్షణ అందించాలని జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా సోమవారం రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఉమర్ జలీల్‌ను ఒక ప్రకటనలో కోరారు. కేవలం 50మందికి మాత్రమే అవకాశాన్ని కల్పిస్తూ జాబితాను రూపొందించడంతో మైనార్టీ అభ్యర్థులు నిరుత్సాహానికి గురవుతున్నారని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వందమందికీ అవకాశాన్ని కల్పించాలని కోరారు.



ప్రగతిమైదానాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

## కొత్తగూడెంలో హెలిప్యాడ్ పరిశీలన

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 30 : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ నవంబర్ 5న కొత్తగూడెం రానున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగూడెం పట్టణంలోని ప్రగతిమైదాన్‌లో ఏర్పాటు చేయనున్న హెలిప్యాడ్‌ను సోమవారం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పరిశీలించారు. మైదానాన్ని పూర్తిగా శుభ్రం చేసి, ఎటువంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నాయకులు, మున్సిపల్ సిబ్బందికి సూచించారు. రెండు, మూడ్రోజుల్లో హెలిప్యాడ్‌ను పూర్తిగా సిద్ధం చేయాలని ఆదేశించారు. వారివెంట కొత్తగూడెం నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్తలు సర్దార్ పుటం పురుషోత్తమరావు, బత్తినీడి ఆదివిష్ణుమూర్తి, మున్సిపల్ కౌన్సిలర్లు, పలు మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో ముగ్గురికి జైలు

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 30 : గంజాయి అక్రమ రవాణా కేసులో ముగ్గురికి కఠిన కారాగార శిక్ష విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి శ్యాంశ్రీ సోమవారం తీర్పు చెప్పారు. భద్రాచలం టౌన్ ఎస్సై రాంబాబు తన సిబ్బందితో 24-2-2019న భద్రాచలం కూనవరం రోడ్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఏపీలోని గన్నవరం డిపో బస్సులో మడకం దేవా, కొవాసి సోనా, గణేష్ మండల్, తమిళనాడుకు చెందిన తానే, ఆలినగరం రంజిత్ గంజాయిని తరలిస్తున్నారు. పోలీసులు వారిని పట్టుకొని చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో ఏడుగురు సాక్షులను విచారించగా దేవా, కోవాసి సోనా, గణేశ్ మండల్‌పై నేరం రుజువు కావడంతో ముగ్గురికి ఒక్కొక్కరికి 10 సంవత్సరాల చొప్పున కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

## అవినీతిని మొగ్గదశలోనే అరికట్టాలి

**విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో సింగరేణి డైరెక్టర్లు**



ప్రతిజ్ఞ చేయించి మాట్లాడుతున్న సింగరేణి డైరెక్టర్లు



వీకే 7లో విజిలెన్స్ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 30 : సింగరేణి ఉద్యోగులు నిజాయితీగా పనిచేస్తూ తమ చుట్టుపక్కల జరిగే అవినీతిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి మొగ్గదశలోనే అరికట్టే విధంగా సంస్థకు సహకరించాలని సింగరేణి డైరెక్టర్ ఈఅండ్‌ఎం సత్యనారాయణరావు అన్నారు. వచ్చేనెల 5వ తేదీ వరకు జరిగే విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. డైరెక్టర్లు ఈఅండ్‌ఎం సత్యనారాయణరావు, డైరెక్టర్ పీపీ వెంకటేశ్వరరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సత్యనారాయణరావు మాట్లాడుతూ 'అవినీతిని తిరస్కరించండి.. దేశం పట్ల నిబద్ధత కలిగి ఉండండి' అనే నినాదం ఈ ఏడాది విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ముఖ్యఉద్దేశమని అన్నారు. డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించుకొని అవినీతిరహిత సమాజాన్ని నిర్మించుకోవాలన్నారు. అడిషనల్ మేనేజర్ విజిలెన్స్ రాజేందర్‌రెడ్డి ఉద్యోగులతో సమగ్రతా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జీఎం సీపీపీ జక్కం రమేశ్, జీఎం పర్సనల్ బసవయ్య, జీఎం విజిలెన్స్ ప్రసాదరావు, జీఎం ఐటీ రాంకుమార్‌రావు, కార్పొరేట్‌లోని వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు, విజిలెన్స్ ఆఫీసర్లు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### కొత్తగూడెం ఏరియాలో...

రామవరం, అక్టోబర్ 30 : సింగరేణి కొత్తగూడెం ఏరియాలో సోమవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వీకే 7లో, ఏరియా వర్క్‌షాప్‌లో అవగాహన సమావేశం జరిగింది. అనంతరం అధికారులు విజిలెన్స్ అవగాహన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పిట్ సెక్రటరీ శనిగరపు శంకర్, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ డేవిడ్, కుమార్‌రావు, మేనేజర్ శంకర్ పాల్గొన్నారు.



కార్మికులకు భోజనాలు వడ్డిస్తున్న ఏరియా జీఎం శాలెంరాజు

## ఆర్‌సీహెచ్‌పీలో సహపంక్తి భోజనాలు

రామవరం, అక్టోబర్ 30 : సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని ఆర్‌సీహెచ్‌పీలో ఉన్న అమ్మవారి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రులు ముగిసిన సందర్భంగా సోమవారం సహపంక్తి భోజనాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కొత్తగూడెం ఏరియా జీఎం శాలెంరాజు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం కోటిరెడ్డి, అజ్మీరా శ్రీనివాస్, వట్టికొండ మల్లికార్జున్, డీవైఎస్ఈ శ్రీనివాస్, పీఏ రాజేశ్వరరావు, మహేశ్వర్ పాండే, పవన్, కొత్తూరి శ్రీనివాస్, గట్టయ్య, పూర్ణ చందర్, భిక్షపతి, గౌస్, గజ్జి శ్రీనివాస్, ఆముదాల అనిల్‌కుమార్, మోతీలాల్, నాగేశ్వరరావు, మొగిలిపాక రవికుమార్, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.